కేజ్‌వీల్స్‌తో 'తారు'మారు

- జిల్లాలో ప్రతి ఏటా రూ 100–150 కోట్ల నష్టం
- కంకర తేలుతున్న వైనం
- జరిమానాలు, కేసులు పెడుతున్న అధికారులు


రోడ్డుపై వెళ్తున్న కేజ్‌వీల్స్ ట్రాక్టర్

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగు కోసం రైతులు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో పొలాలు దున్నిస్తారు. అయితే ట్రాక్టర్ల ఓనర్లు కేజ్‌వీల్స్‌తో రోడ్లపై వస్తుండడంతో రోడ్లు పాడవుతున్నాయి. ట్రాక్టర్ ఒక్క చోటు నుంచి మరో చోటుకు వెళ్లినప్పుడు రోడ్డుపైకి రావాల్సి వస్తుంది. దీంతో, కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ రోడ్డుపైన అటూ, ఇటు నడిచినప్పుడు రోడ్లన్నీ చెడిపోతున్నాయి. జిల్లాలో కోట్లాది రూపాయలతో వేసిన రోడ్లు ధ్వంసమవుతున్నాయి.

జిల్లాలో 15 వేలకు పైగా ట్రాక్టర్లు..

జిల్లాలోని రైతులు దాదాపు 15 వేల ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు. దీనికి తోడు, ప్రతి ఏడాది కనీసం 1000 నూతన ట్రాక్టర్లు వస్తున్నాయి. ఈ ట్రాక్టర్లన్నింటికీ రైతులు ఫుల్ కేజ్‌వీల్స్‌ను బిగిస్తున్నారు. ట్రాక్టర్ కేజ్‌వీల్స్ కు ఓనర్లు అలాగే రోడ్లపై తిగుతుండడంతో కంకర రోడ్లుగా మారుతున్నాయి.

తారు రోడ్డు వేసిన ఏడాదిన్నరకే..

ఒకసారి తారు రోడ్డు వేస్తే, ఆ రోడ్డు 15 ఏళ్ల పాటు ఉంటుంది. కాని, కేజ్‌వీల్స్ బిగించిన ట్రాక్టర్లు తారు రోడ్డుపై నడుస్తుండటంతో ఏడాదిన్నరకే ఆ రోడ్డు రూపు రేఖలు మారిపోతున్నాయి. జిల్లాలో ప్రతి ఏటా దాదాపు కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌తో దాదాపు 300–500 కోట్ల విలువ గల రోడ్లు చెడిపోతున్నాయి. ప్రభుత్వం రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్ నడపటాన్ని నిషేధించింది. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ అధికారులు కేజ్‌వీల్స్ నడిపించే ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తున్నారు.

రైతులు ఏం చేయాలంటే...

రైతులు ఓ వైపు ఆధునిక వ్యవసాయ పరికరాలతో వ్యవసాయం చేస్తూనే, మరోవైపు రోడ్లను కాపాడాల్సిన బాధ్యత ఉంది. దీనికోసం కేజ్‌వీల్స్‌కు రోడ్ రింగ్‌ను అమర్చుకుని రోడ్లపై నడిపిస్తే రోడ్డు చెడిపోదు. అవసరమైతే ట్రాక్టర్ పొలం వద్దకు వెళ్లగానే రోడ్ రింగ్‌ను తీసివేయవచ్చు. ఇనుముతో తయారు చేసే రోడ్ రింగ్ ధర రూ. 2 వేల లోపే ఉంటుంది. దీన్ని ఉపయోగించి రోడ్లను కాపాడుకోవచ్చు.

రోడ్లపై నడిపితే చర్యలు



కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను తారు రోడ్డు, సిమెంట్ రోడ్లపై నడిపితే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్యం చేస్తున్నాం. చాలా చోట్ల జరిమానాలు విధించాం. అవసరమైతే కేసులు నమోదు చేస్తాం. రైతులు రోడ్డు చెడిపోకుండా కేజ్‌వీల్స్‌కు రోడ్డు రింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

– అశోక్‌కుమార్, ఎస్పీ


కథలాపూర్: మండల కేంద్రంలోని శివారులో వరదకాలువ వంతెనపై మట్టి చేరడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వర్షపు జల్లులు కురియడంతో వంతెన వద్ద మట్టి బురదగా మారి వాహనాలపై వెళ్లేవారు అదుపుతప్పి పడిపోతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు చొరవ చూపి వరదకాలువ వంతెనపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శంకర్,ఎంపీడీవో, కథలాపూర్ సెల్ నం.: 9281481652

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

బయో మైనింగ్ విధానంపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులకు బయో మైనింగ్ విధానంపై మున్సిపల్ కమిషనర్ రవీందర్ బుధవారం అవగాహన కల్పించారు. ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు పట్టణ శివారులోని డీఆర్‌సీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. తడి చెత్త నుంచి ఎరువుల తయారీ, పొడిచెత్త డీఆర్‌సీసీలో ఏవిదంగా వేరు చేస్తారో మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వైర్ల దొంగలున్నారు జాగ్రత్త..


వైర్లు ఎత్తుకెళ్తున్న దొంగ

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో చిల్లర దొంగతనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సీసీ కెమెరాలు ఉన్నా.. దొంగలు అవేం పట్టించుకోకుండా దొంగతనాలకు పాల్పడుతున్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి ఓ వ్యక్తి పాఠ్యపుస్తకాలు దొంగిలిస్తూ.. సీసీ కెమెరాకు చిక్కాడు. సదరు దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. తాజాగా జిల్లా కేంద్రంలో జంబిగద్దె ప్రాంతంలో నిర్మిస్తున్న ఓ ప్రైవేటు భవనంలో గుర్తుతెలియని ముగ్గురు విలువైన వస్తువులతోపాటు, వైర్లు ఎత్తుకెళ్లారు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పట్టపగలే ఇలా ల్లర దొంగతనాలు జరుగుతుండడతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి


లబ్ధిదారుడితో మాట్లాడుతున్న కమిషనర్

మెట్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. బీం లెవల్ వరకు పనులు పూర్తి చేస్తే లబ్ధిదారుల ఖాతాలో వెంటనే రూ.1 లక్ష జమ చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణంలో వివిధ దశలను పూర్తి చేస్తే దాని ప్రకారం డబ్బులు జమవుతాయన్నారు. లబ్ధిదారులు దీనిని దృష్టిలో పెట్టుకుని త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు.

కిక్ బాక్సింగ్‌లో వ్యవసాయ విద్యార్థుల ప్రతిభ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలకు చెందిన బి. వైష్ణవి, మౌనిక, విశాల్ పుండీర్‌లు కిక్ బాక్సింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు పతకాలు సాధించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లోని బల్బీర్ సింగ్ జునేజా స్టేడియంలో జూలై 16 నుంచి 20 వరకు నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించగా, అందులో పొలాసకు చెందిన విద్యార్థులు బి. వైష్ణవి రెండు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించగా, విశాల్ పుండీర్, మౌనిక పతకాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం వ్యవసాయ కళాశాలలో విద్యార్థులను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీ నారాయణ భట్, కోచ్ రామాంజనేయులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యనారాయణ రెడ్డి అభినందించారు.

నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి వెల్గటూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఉమాసాగర్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులు, గొర్ల కాపర్లు చీకటి పడకముందే ఇంటికి చేరుకోవాలని సూచించారు. వాగులు, నదుల్లోకి ఈతకు వెళ్లకూడదని, విద్యుత్ స్తంభాలను తాకరాదని, పాత ఇళ్లలో ఉండకూడదని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేయాలని తెలిపారు.

ఆర్టీసీ డిపోలో మహాలక్ష్మీ సంబరాలు


విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఆర్డీవో

కోరుట్ల: పట్టణంలోని టీఎస్ ఆర్టీసీ డిపోలో బుధవారం మహాలక్ష్మీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో సంబరాలు నిర్వహిస్తున్నామని డీఎం మనోహర్ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో జీవాకర్ విద్యార్థులు, ఉద్యోగులు, కూరగాయలు అమ్మే మహిళలను సత్కరించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్‌వైజర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

ధర్మపురి : మహాలక్ష్మి పథకంలో భాగంగా 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండులో మహిళా ప్రయాణికులను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల డిపో మేనేజర్ కల్పనా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాం నర్సింహరెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్ హాజరయ్యారు.

అల్లీపూర్‌లో రుద్రాభిషేకం


అభిషేకంలో పాల్గొన్న భక్తులు

రాయికల్: మండలంలోని అల్లీపూర్ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ భజన మండలి అధ్యక్షుడు చిట్యాల భూమయ్య, కార్యదర్శి లక్ష్మీనర్సయ్య, దేవాలయ అధ్యక్షుడు నామని శేఖర్, అర్చకులు వినయ్, విక్రమ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

మేడిపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి అన్నారు. మేడిపల్లిలోని పీఎస్‌ఆర్ గార్డెన్‌లో మండల అధ్యక్షుడు చిట్యాల సురేశ్ అధ్యక్షతన బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి, భీమారం మండల అధ్యక్షుడు నాగం శివ కుమార్, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కన్వీనర్లు, పాల్గొన్నారు.

సారంగాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతోనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల కృష్ణహరి, జిల్లా కన్వీనర్ బెజ్జారపు ప్రవీణ్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బిజేపి నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆడేపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు గర్రకుర్తి రమేష్ పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి

మల్లాపూర్: ప్రధాని మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పార్టీ మండల సమావేశానికి హాజరై మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా పార్టీ శ్రేణులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రభారి రాజేందర్, జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యక్షుడు మల్లేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలని మాతాశిశు సంరక్షణాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆధునాతన వైద్య సదుపాయాలు, వసతులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, కారకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. బుధవారం తాండ్ర్యాల ఎక్స్‌రోడ్డు వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై మండలస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితిలో ఉండటం దారుణమన్నారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, కంటె సత్యనారాయణ పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలపై పోరాడతాం

రాయికల్: జిల్లాలోని పాత్రికేయుల సమస్యల కోసం పోరాడతామని టీయూడబ్ల్యూజే, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం రాయికల్‌లోని ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతీ మండలంలో ప్రెస్‌క్లబ్ భవనాలను ఏర్పాటు చేస్తామని, జర్నలిస్టులకు హెల్త్ స్కీం వర్తింజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంపూర్ణచారి, ఉపాధ్యక్షుడు హైదర్‌అలీ, కోశాధికార్లి వేణు, సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నాగమల్ల శ్రీకర్, శంకరయ్య, పాత్రికేయులు పాల్గొన్నారు.

'గంగనాల'కు నీరు విడుదల చేయండి

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి శివారులోనిని గంగనాల ప్రాజెక్టుకు వెంటనే ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు వేరు వేరుగా రైతులు అరె రమేశ్, రాదారపు దేవదాసు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో కేవలం 20 టీఎంసీల నీరు మాత్రమే ఉందని ప్రాజెక్టు నిండితే నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పీజీటీ(ఫిజిక్స్) పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనిత బుధవారం తెలిపారు. ఎం.ఎస్సీ ఫిజిక్స్, బీ ఎడ్ పూర్తి చేసిన వారు ఈనెల 25వ తేదీలోగా మోడల్‌స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26వ తేదీన డెమో క్లాసులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి


వినతిపత్రం ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మల్లాపూర్: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ రమేష్ గౌడ్‌కు మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో విద్యా, ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యప్రకాష్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్, టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాజయ్య, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కథలాపూర్ తహసీల్దార్ వినోద్‌కు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో యూఎస్పీసీ మండల సంఘం సభ్యులు కృష్ణారావు, పులికాంత శశిధర్, ఎం.డీ ఖలీద్‌పాషా, రాజశేఖర్,నజీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంపై రైతుల ఆందోళన


సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కథలాపూర్: త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో తరచుగా అంతరాయం ఏర్పడుతుందని మండలం కలిగోట గ్రామానికి చెందిన రైతులు బుధవారం అంబారిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. త్రీఫేజ్ కరెంట్ సరిగా సరఫరా కాకపోవడంతో పొలాలకు నీళ్లందించలేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే త్రీఫేజ్ విద్యుత్‌ను అంతరాయం లేకుండా సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ పరికరాల సమస్య ఉంటే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ భూమేశ్వర్ తెలిపారు.



రాయికల్: మండలంలోని ఆలూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం పొలంబాట పట్టారు. వ్యవసాయంలో మెలకువల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కలిసి పొలంలో వరినాట్లు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్కినపల్లి సతీశ్, రమేశ్, సాయికృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలను ఎత్తుకుని పోతరాజుల వేషాలు, విన్యాసాలు, డప్పుచప్పుళ్లతో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇల్లెందుల ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట రైతువేదికలో బుధవారం ఉద్యానశాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్యాంప్రసాద్ మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి గల రైతులకు పంట సాగు, దిగుబడిపై అవగాహన కల్పించారు. మండల ఉద్యాన అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈవో వినీత, మేనేజర్ భరత్ తదితరులు ఉన్నారు.

కారుణ్య నియామక ఉద్యోగులకు కౌన్సెలింగ్

జగిత్యాల: తల్లిదండ్రులను ప్రతీఒక్కరు పోషించాలని, నిరాదరణకు గురిచేస్తే చర్యలు తప్పవని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం కార్యాలయంలో తల్లిదండ్రులను పోషించక నిరాదారిస్తున్న కారుణ్య నియమకాలపై ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వనాథం, హన్మంతరెడ్డి, ప్రకాశ్‌రావు, శివనందం, రాజ్‌మోహన్, అశోక్‌రావు, యాకూబ్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

కోరుట్ల: కోరుట్ల సర్కిల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్కిల్ లెవల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సంధర్బంగా సీఐ సురేష్ బాబు మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను పాడు చేసుకోవద్దని అన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్సైలు చిరంజీవి, నవీన్ కుమార్, శ్రీధర్ రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలను పెంచాలని వినతి

ధర్మపురి(బుగ్గారం): బుగ్గారం మండలంలో అదనంగా మరో మూడు ఎంపీటీసీ స్థానాలను పెంచాలని బుధవారం గ్రామస్తులు ఎంపీడీవో అఫ్జల్ మియాకు వినతి పత్రం అందజేశారు. బుగ్గారంలో ఓటర్ల సంఖ్యతో పాటు జనాభా పెరిగినందునా.. దాన్ని దృష్టిలో ఉంచుకొని బుగ్గారం ఎంపీటీసీ-1, బుగ్గారం ఎంపీటీసీ-2లుగా పెంచాలని కోరారు. అదే విధంగా చిన్నాపూర్, చందయ్యపల్లె గ్రామాలను విడదీసి ఒకే ఒక ప్రత్యేక ఎంపీటీసీ కేటాయించాలని, శెకల్ల ను ప్రత్యేక ఎంపీటీసీగా, యశ్వంతరావ్‌పేట-గంగాపూర్ గ్రామాలకు ఒక ఎంపీటీసీ స్థానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

యూరియా పంపిణీలో నిబంధనలు పాటించాలి

మెట్‌పల్లి రూరల్: యూరియా పంపిణీలో నిబంధనలు పాటించాలని వ్యవసాయ, సహకార అధికారులు భాస్కర్, మనోజ్ అన్నారు. మెట్లచిట్టాపూర్ పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. ఎకరాకు ఒక యూరియా బస్తా మాత్రమే విడతల వారీగా రైతులకు అందించాలని సిబ్బందికి సూచించారు. ఏడీఏ రమేష్, ఏవో దీపిక, సహకార శాఖ సీనియర్ ఇన్స్‌పెక్టర్ నిజమొద్దీన్, సహకార సంఘం చైర్మన్ నవీన్ రెడ్డి, సీఈవో తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

ధర్మపురి: ధర్మపురి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థి ముస్కు విశాల్ ఇటీవల మెట్‌పెల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించి ఆగస్టు 3న హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థిని హెచ్‌ఎం కొలిచాల శ్రీనివాస్, పీడీ అటుకుల స్వప్న, ఉపాధ్యాయులు అభినందించి షూలు అందజేశారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామి గుడికి విరాళం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయానికి మంచాల లక్ష్మీరాజం-అనంత లక్ష్మి ల చిన్న కుమారుడు కోడలు తిరుపతి -తులసి దంపతులు రూ. 25,016 ఆలయ కమిటీకి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

పాఠశాలల్లో జన్మదిన వేడుకలు నిర్వహించొద్దు

జగిత్యాల: జన్మదిన వేడుకలకు సంబంధించి ఎవరైనా పాఠశాలల్లో వేడుకలు నిర్వహిస్తే జాగ్రత్తగా ఉండాలని డీఈవో రాము ఉత్తర్వులు జారీ చేశారు. ఇది జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. వేడుకలు నిర్వహించవద్దని ఉత్తర్వులు జారీ చేశారంటూ పుకార్లు లేచాయి. ప్రజాప్రతినిధులు గానీ, ప్రముఖ వ్యక్తులు గానీ జన్మదిన వేడుకలుంటే స్కూళ్లలో విద్యార్థులకు పెన్నులు, బుక్స్ పంపిణీ చేస్తుంటారు. ఈ ఉత్తర్వులతో కొందరు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందునా జాగ్రత్తగా ఉండాలని మాత్రమే పేర్కొన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కానీ జన్మదిన వేడుకలను పూర్తిగా నిర్వహించొద్దని ఉత్తర్వుల్లో పేర్కొనలేదని డీఈవో తెలిపారు.